
# మెరుపులో మరకలు!


(రచయిత)

• రచన: శ్రీ పేరిచర్ల రామకృష్ణ *

(గతసంచిక తరువాయి)

భర్తమీద విపరీతమయిన ద్వేషము రోజు రోజుకీ పెరిగిపోతోంది. ఆమె ఆలోచించేది ఒక్కటే— భర్త ఎప్పటికయినా మారగలడేమోనని!

రోజూలాగే రామరాజు మిత్రబృందం చతుర్ముఖ పారాయణము మొదలుపెట్టింది.

చీకటి పడింది.

అర్ధరాత్రి దాటింది.

దూరముగా తొలికోడి కూసింది.

తెల్లవారుఝాము అయిదు కావస్తుంది

తూర్పు ఎర్రబడుతోంది.

వాళ్ళు మాత్రం - వాళ్ళ ప్రపంచములోంచి బైట పడలేదు. సమయాల్ని, సందర్భాల్ని దూరముగా గిరాటు వేసారు.

వాళ్ళకి దూరముగా ఓ మూల మోకాళ్ళ మీద తల ఆన్చి, అమాయకముగా నిద్ర పోతోంది గాయత్రి.

సరిగ్గా అప్పుడే బయట తలుపు శబ్దమయ్యింది.

అంత గాఢ నిద్రలోనూ తృళ్ళి పడింది గాయత్రి.

వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా తండ్రి సోమరాజు,

ఇంతటి నీతి బాహ్యమయిన పరిస్థితిలో తండ్రి రాకను చూసి ప్రాణ్పడిపోయింది గాయత్రి.

"ఎవడే వాడు - ఇప్పుడు వచ్చింది?"

"మా నాన్నగారు." నెమ్మదిగా చెప్పింది.

రామరాజు విస్మయం చెందాడు.

ఈ సమయములో అది ఊహించనిది.

మిత్రబృందము హఠాత్తుగా ఆటకు స్వస్తి చెప్పి వేగముగా గదిలోంచి బయటకు వెళ్ళిపోయారు.

మామగారికి ముఖము చాటేసి రామరాజు కూడా బయటకు వెళ్ళిపోయాడు.

చెల్లాచెదురుగా పడివున్న పేకముక్కలు.

కాళీ విస్కీ సీసాలు.

అటూ - ఇటూ దొర్లుతున్న గ్లాసులు.

సిగరెట్ పీకలు.

చికెన్ బిర్యానీ తాలూకు ఎముకల చెత్త.

అసహ్యముగా వాంతిని పుట్టిస్తున్న ఆ గది - మున్సిపాలిటీ కుండిలా వుంది.

అలాంటి భయంకర వాతావరణాన్ని చూసి సోమరాజుగారు కూతురు వంక ప్రశ్నార్థకముగా చూశారు.

గాయత్రి మౌనముగా తల దించుకుంది.

"ఏమిటమ్మా, తెల్లవార్లూ ఈ ఆటలు-భాగోతాలు! రోజూ ఇంతేనా?"

గాయత్రి ఏమీ మాట్లాడలేక పోయింది. వెంటనే ఏడ్పును ఆశ్రయించింది.

"అయినా, ఇది యిల్లనుకున్నాడా, క్లబ్బను కున్నాడా ?"

"చెప్పి చూశాను నాన్నా ! ప్రయోజనము లేక పోయింది."

"ఇంత జరుగుతున్నా, ఈ విషయాల్ని ఉత్తరాల్లో ఎందుకు రాయలేదమ్మా !"

"..................."

"సరేలే, మీ ఆయన రానీ ! నేనే మాట్లాడతాను. అయినా ఇదేం అలవాటు? గుట్టుగా సంసారము చేసుకునే వాళ్లెవరూ, ఇలా బరితెగించరు ! ఇలాంటి మనిషని ముందే తెలిస్తే, నీకు రామరాజుతో పెళ్ళి చేసేవాడ్ని కాదమ్మా ! పట్నములో ఉద్యోగము చేస్తున్నాడని, నువ్వు సుఖపడతావని."

సరిగ్గా అప్పుడే రామరాజు వచ్చాడు.

"నీ స్నేహితుల్ని సాగనంపి వచ్చావా అల్లుడూ ! అయినా నీ కిదేం పాడుబుద్ధయ్యా ! ఎంత పేకాట ఆడితే మాత్రం సమయమూ, సందర్భమూ అఖ్ఖర లేదా ? పడగ్గదిలోకి పబ్లిక్‌గా మనుషుల్ని తీసుకొచ్చి తెల్లవార్లూ ఆడుతూకూర్చుంటే... అయినా గాయత్రికి ఇలాంటివి అస్సలు ఇష్టముండదని తెలుసు కదా ! పెళ్ళయి నెల కాలేదు, చూడు - గాయత్రీ ఎంతలా చిక్కిపోయిందో ! అంతగా చేతులు దురద పుడు తుంటే, ఏక్కడో ఆడుకుని సమయానికి ఇంటికి చేరుకోవాలి." రామరాజు మీద కళ్లెర్రజేస్తూ కోపంగా కోపముగా అన్నారు సోమరాజుగారు.

మామగారి మాటల్ని రామరాజు లక్ష్య పెట్ట లేదు.

సహనం కోల్పోయినవాడిలా "నా కన్నీ తెలుసు. మీరు నాకు నీతి కబుర్లేమీ చెప్పక్కర్లేదు."

భర్త తన తండ్రికి ఎదురుచెప్పేటప్పటికి గాయత్రి కంగారు పడిపోయింది.

"నాలుగురోజులు వుందామని వచ్చాను. ఇలాంటి పరిస్థితిలో ఇంకా యిక్కడ వుండటము నా తెలివి తక్కువతనము అవుతుంది. వస్తాను గాయత్రీ !"

"అదేమిటి నాన్నా ! ఇప్పుడే కదా వచ్చింది? అప్పుడే వెళ్ళిపోవటము ఏమిటి ?"

"నిన్ను చూశాను కదమ్మా ! నాకు అంతేచాలు."

'పోనీ భోజనము చేసి వెళ్ళండి నాన్నా !'

'కడుపు నిండి పోయిందమ్మా ! మీ అయన్ని, ఇక్కడ పరిస్థితిని చూసి వస్తానమ్మా !'

గాయత్రి వుండమని ఎంత చెప్పినా, వినకుండా వెళ్ళిపోయారు సోమరాజుగారు.

మామగారు అలా వెళ్ళగానే రామరాజు అందు కున్నాడు.

'ఏమే ! ఏదో ఘోరం జరిగిపోయినట్టు అన్నీ మీ నాన్నకు చెప్పేశావ్ ?' ఉన్న కోపాన్నంతా వెళ్ళ గ్రక్కాడు

'నేను ప్రత్యేకించి చెప్పకపోయినా, ఇక్కడున్న వాతావరణము ఆయన పసిగట్టగలరు."

"అయ్యిందేదో అయ్యింది. మీనాన్నొచ్చి ఎలానూ చూశాడు. కాబట్టి ఇక యీ గదిలో పేక ఆడంలే ! నువ్వింక నిశ్చింతం వుండొచ్చు !" అంటూ బయటకు వెళ్ళిపోయాడు రామరాజు.

భర్త అంటున్న మాటలు నిజమో కాదో అర్థం కాలేదు.

ఆ రోజు సాయంత్రము ఆడటానికి ఎవరూ రాలేదు. గాయత్రి బరువుగా గాలి పీల్చుకుంది. మనస్సు తేలిక పడింది చాలా రోజుల తరువాత.

రామరాజు ఎప్పుడో వచ్చి భోజనము చేసి వెంటనే మళ్ళీ వెళ్ళిపోయాడు.

మళ్ళీ వెలుగు వచ్చేముందు ఇంటికి వచ్చాడు.

"ఇంత అలస్యమయిందేమిటండీ !" అడిగింది గాయత్రి.

"ఆర్నీ... నీకు చెప్పలేదు కదూ ! మనంటిలో ఆడనని మాటిచ్చా కదా - అందుకే బయట ఆడి వస్తున్నా !" అదేదో పెద్ద జోకులా చెప్పి కిసుక్కున నవ్వాడు రామరాజు.

"మీరు ఎక్కడో ఒక చోట పేకాడి రావటము,

తాగుతూ కూర్చోవటము చూస్తే-ఇక నే నెందుకు? అస్సలు నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు? ఇక మీకు నా అవసరం ఏముంది? ఇక్కడ నే నుండ లేను. మా యింటికి వెళ్ళిపోతాను." ఏడుస్తూ అంది గాయత్రి.

రామరాజు గాయత్రి మాటల్ని పట్టించుకోలేదు. నేరుగా వెళ్ళి మంచము మీద వాలిపోయాడు.

గాయత్రికి ఏమి చేయాలో ఆ క్షణములో అర్థము కాలేదు.

* * * *

'చెల్లాయ్!' అంటూ గదిలోకి వచ్చాడు భాస్కర్.

తన భర్త లేకుండా భాస్కర్ ఒంటరిగా రావటం అదే మొదటిసారి-

లోనికొస్తూనే చుట్టూ పరికించి చూసి "రామరాజు న్నాడా?" అన్నాడు భాస్కర్.

"లేరు." అన్నట్టుగా అడ్డముగా తలూపింది గాయత్రి.

"నీకో నిజం చెప్పాలి. నిన్న బాంకులోంచి విత్ డ్రా చేసిన అయిదువేలు రామరాజు నా జేబులోంచి కొట్టేశాడు."

"ఏమిటి మీరనేది?" అయోమయముగా అంది గాయత్రి,

"నీ మొగుడు దొంగతనము చేశాడని చెబుతున్నాను."

"నే న్నమ్మను."

"నీ మొగుడు పెద్ద ఆఫీసరనుకున్నావా? బోడి అరొందల జీతగాడు. అది తిండికి, ఇంటి అద్దెకీ సరి పోదు. అలాంటిది రాత్రీ - పగలూ పేకాడుతూ, తాగుతూ కూర్చుంటే, ఎలా సరి పోతుంది. నాకు తెలీదు, చిల్లర-చిల్లరగా ఏభైలూ, వందలూ చాలా కొట్టేశాడు. అయినా, మేము పట్టించుకోలేదు. అలాంటిది రాత్రి అందరూ తాగిన మైకములో ఉండగా ఐదు వేలు. ఏకముగా ఐదు వేలు ఎగ్గొట్టేశాడు. రామరాజు వచ్చిన వెంటనే నేను రమ్మన్నానని చెప్పు." గాయత్రి వంక కొర-కొరా చూస్తూ అన్నాడు భాస్కర్.

'కథాంజలి' దీపావళి సంచికకు మా హృదయ పూర్వకమైన శుభాకాంక్షలు !

Estd. 1957 Phone : 2373



ఎల్లప్పుడూ...

మా ప్రసిద్ధిచెందిన

* జంకాళాలు * బెడ్‌షీట్లనే

ఉపయోగించండి.

ఆంధ్రప్రదేశంలో మా ప్రతినిధిగా చేరుటకు సమర్థులైనవారి నుండి

ధరకాస్తు కోరబడుచున్నాము.

—: తయారించువారు :—

**Rainbow Industrials**

P. B. No. 261 :: BHAVANI - 638 302

తన భర్త దొంగ అని తెలిసినప్పటినుండి నరాలు పట్లు పదిలాయి." నిలువునా కుప్పకూలి పోయింది గాయత్రి.

ఎప్పటికో రామరాజు వచ్చాడు.

భాస్కర్ వచ్చిన విషయం చెప్పింది గాయత్రి.

రామరాజు ఐదు వేల సంగతి నిజాయితీగా ఒప్పుకున్నాడు.

గాయత్రి వెంటనే తండ్రికి లెటరు వ్రాసింది డబ్బు పంపమని వారం రోజుల తర్వాత ఐదు వేలు మనియార్డరు అందుకుంది.

"చాలీ చాలని జీతముతో ఈ పేకాట - తాగుడు- సిగరెట్లు ఎందుకండీ? మిమ్మల్ని భాస్కర్ ఎంతెంత మాటలన్నాడో తెలుసా? వినలేక నా గుండె తరుక్కు పోయింది. వాళ్ళతో స్నేహం మానుకోండి. ఇలాంటిదే మానుకోండి, ఇలాంటివే కొన్ని హిత వచనాలు చెప్పి భర్త చేతిలో ఐదు వేలు పోసింది. భాస్కర్ డబ్బు భాస్కర్ చేతిలోకి యిచ్చి రమ్మని.

రామరాజు మాత్రం భాస్కర్‌కి ఐదు వేలిచ్చాడో లేదో తెలీదు. కానీ తన వ్యసనాన్ని మాత్రం ఇంకా ఉధృతం చేసుకున్నాడు.

* * *

గతం జ్ఞాపకాల ఆలోచనలనుండి సుడిగుండము లోంచి నెమ్మదిగా బయట పడింది గాయత్రి.

మారని భర్తతో ఎన్నాళ్ళిలా జీవితాన్ని వెళ్ళబుచ్చాలి?

మార్పులేని వ్యక్తితో ఎలా రాజీ పడటం?

వచ్చిన మొదట్లో తప్ప - భర్తనుంచి తనేం వైవాహిక సుఖం అనుభవించింది?

'కథాంజలి' దీపావళి సంచికకు మా హృదయపూర్వకమైన శుభాకాంక్షలు!

KOMA

ఫ్యూయల్ ఇంజక్షన్ పరికరములు

మిక్కిలి శ్రేష్ఠమైనవి మరియు నమ్మకమైన సర్వీస్ చేయునవి





లేలాండ్ - పెర్కిన్స్ - బెంజి
ట్రక్కులకు మరియు
అన్నిరకముల ట్రాక్టర్లకు

డి' ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్
గోపాల్ బాగ్, అవనాషి రోడ్
కోయంబత్తూరు-18

VSK DE 430 TEL

ఊహాలు ఆలోచిస్తూ, గాయత్రి నెమ్మదిగా కనులు తెరిచింది.

ఇలా ఎన్నాళ్లు పడివుండటం?

ఏదో తేల్చుకోవాలి.

పక్క గదిలో నిద్ర పోతున్నాడు. రామరాజుది పెద్ద నిద్ర గాయత్రికి తెల్సు.

నెమ్మదిగా లైట్ వేసింది.

కలం, కాగితం తీసుకుంది.

రాయటము మొదలుపెట్టింది.

శ్రీ వారికి—

ఉద్యోగము చేసే వ్యక్తి భర్తగా వస్తూంటే, ఏ ఆడపిల్లయినా సంతోషపడుతుంది. అలాంటిది పట్నంలో ఉద్యోగము చేసే భర్తల బస్తీ... ఇక వేరే ఆనందం ఏముంటుంది? మీరు నాకు భర్త కాబోతున్నారని తెల్సి నా ఆనందానికి అవధులు లేకపోయాయి. అందులోనూ హైదరాబాద్ కాపురం అనేటప్పటికి ఎన్నెన్నో రంగుల కలల్ని వూహించుకున్నాను. కానీ ఇక్కడకు వచ్చాకే మీ అసలు పూరూడము తెల్సుకున్నాను. ఉద్యోగపు మెరుపుల్లో నేను మానసికముగా చాలా నరకాన్ని అనుభవించాను. ఇంతటి నరకాన్ని ఏ స్త్రీ అనుభవించుతుండదని అనుకుంటున్నాను.

పట్నములో ఉద్యోగమంటే అనుకున్నంత జల్సా కాదని ఆలస్యముగా తెల్సుకున్నాను. ముందు మీ పరిస్థితులలో రాజి పడి పోవాలనే నిర్ణయించుకున్నాను. కానీ మీరు చేసేది ఏమిటి? తాగటం - పేకాడటం - వ్యభిచరికచటం - అప్పులు చేయటం - ఏ భార్య ఊహించలేనకగా దొంగతనము చేయటము ఇవి చాలవా? మీరు...మీరు మానసికముగా నన్ను హింసించటానికి? అదే నా స్థానములో మరో స్త్రీ ఉంటి వుంటే మీకు విడాకులిచ్చి వుండేది. నేను కూడా మీ జీవితము నుండి మొదట్లో విడిపోవాలనే చూశాను కానీ ఆశ...ఎప్పటికయినా మీరు మారతారనే ఆత్రుత...ఆ ఆశే నన్ను శిలలా ఈ గదిలో కట్టి పడేసింది.

With best compliments from :
UNIVERSAL LAUNDROMAT



Reversible Cloth, Washing Machine
Fully Stainless Steel.
Approved by Quality Control Centre
Phone : 35483
Mfrs :
EMPIRE INDUSTRIES
No. 5, Corporation Shopping Complex
JAIL ROAD, COIMBATORE-641 018.

ఒకే ఒక్క ఇరుకు గదిలో కాపురము చేయటమంటే మాటలు కాదు, అలాంటిది ఉన్న ఒక్క గదిలోకి నలుగుర్నీ తీలుకొచ్చి, మీ ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తే—అప్పుడే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను ఎందుకో—ఆ పని చేయలేక పోయాను.

మా నాన్నగారు వచ్చినప్పుడు ఆయనతో మా వూరు వెళ్ళిపోవాలనుకున్నాను. కాని, వెళ్ళలేక పోయాను. ఎందుకంటారు? మీరు ఎలాంటి హేయ్యమయిన పనులు చేసినా, మీ మీద 'ప్రేమ' ఉండముట వల్లనే, ప్రతీ స్త్రీ భర్త నుండి దాంపత్య

సుఖాన్ని కోరుకుంటుంది. కాని, నాకా అదృష్టాన్ని ఎప్పుడు పంచారు? భార్యగా నేనుండగా మీరు మరో స్త్రీ వెంట పడినప్పుడు, ఇక నేను మాత్రము ఎందుకు పడుండాలి?

మీ వ్యక్తిత్వాన్ని (ఉంటే?) మీతో పంచుకున్న జీవితాన్ని అనుభవించి, రంగరించి చూస్తే మీరు నన్ను కేవలము కట్నము కోసమే పెళ్లి చేసుకున్నారనిపిస్తుంది. ఏ భర్తా తన భార్యను నల్గురు మగాళ్ళ మధ్య కూర్చోమని ఆజ్ఞాపించడు. అలాంటి పని మీరు చేశారు. వాళ్ళ చూపుల్లోనూ, ఏహ్యమయిన మాటల్లోనూ ఎంత చిత్రవధ అనుభవించానో మీకు తెల్సా? అయినా అది చాలా మాములు విషయముగా తీసుకున్నారు మీరు.

మీకు తెలియనిది మరొకటుంది. భాస్కర్ తరుచూ మీరు లేనప్పుడు రావాలని ప్రయత్నించేవాడు అతని ప్రవర్తన నచ్చక తలుపు తీసేదాన్ని కాదు. అతని గురించి మీకు చెప్పాలనుకున్నాను. కాని, నాకంటే మీ స్నేహితులే ఎక్కువని మౌనంగా వుండి పోయాను.

కనీసము రెండు గదులున్న యిల్లు వుంటే మీరంతా ఎలా ప్రవర్తించినా, నేను మరో గదిలో వుండటానికి అవకాశము వుండేది. అలాంటి ప్రయత్నము మీరు చేయరని తెల్సు. అందుకే యిక ఓర్పుతో ఉండలేక వెళ్ళిపోతున్నాను. అక్కడ మీ రాక కోసము అశోక వనములో సీతలా నిరీక్షించే సహనము ఎప్పుడో చచ్చి పోయింది.

రెండు నెలలు గడువు యిస్తున్నాను. మీరు కనీసము రెండు గదులున్న ఓ యిల్లు చూడాలి. అది పెంకుటిల్లు. తాటాకు పాకా అనేది కాదు ముఖ్యం. రెండు గదులే ముఖ్యం. ఆ యింటికి మీ ఫ్రెండ్స్ ఎవ్వరూ రాకూడదు.

అత్యవసర పరిస్థితిలో తప్ప ఎట్టి పరిస్థితిలోనూ రాత్రులందు యిల్లు విడిచి వెళ్ళకూడదు.

పేకాట, తాగుడు, సిగరెట్లు, దొంగతనము, వ్యభిచారము – ఇలాంటివన్నీ మానేయమని నేననటం లేదు. కనీసము తగ్గించుకోవాలి.

ఈ రెండు నెలల్లోనూ బాగా ఆలోచించి షరతులకు అంగీకరించి దిగి వస్తే, నేను మీతో రావటానికి అంగీకరిస్తాను. లేకపోతే. మన వివాహ బంధము ఇంతటితో తెగి పోతుంది. ఆ తర్వాత కుమిలిపోతూ ఇంట్లో కూర్చుండిపోను. మరో పెళ్లి చేసుకుంటాను. మీ లాంటి ఉద్యోగ మొగుడ్ని మాత్రము కాదు.

వెళ్లిపోతున్నాను. నా కోసము రావాలనుకుంటే తప్పనిసరిగా మనస్సు మార్చుకునే రావాలి.

మీ
గాయత్రి."

రాసిన లెటర్ని టేబుల్ మీద పెట్టి, ఆ బుల్లి గది లోంచి బయటి ప్రపంచములోకి అడుగు పెట్టింది. అంతే

R. K. S. KNITTINGS TIRUPUR
Trade Mark
Regd. No. 342215

With best compliments from :

ISI
IS : 4964-80

మా ప్రత్యేక తయారింపులు :—

* పాయల్ ఫ్రెంచి
* ISI కూల్ టెక్స్
* ISI పాయల్
* ఫ్రాంక్ ఫిట్ గిట్
* డ్యూరబల్
* రస్సెర్ ఫ్రెన్సీ

Phone : 22016 Resi : 27169

R. K. S. Knittings

9, Cauvery St., Odakkadu, TIRUPUR-638 602.